సమయం, ఆదా పేరుతో రైళ్ల దారి మళ్లింపు

• దువ్వాడలో ప్రయాణికుల అగచాట్లు • రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు అంతంత మాత్రమే
• భోజనాలు, టిఫిన్లు దొరకవు... మరుగుదొడ్లు శుభ్రంగా ఉండవు..





బయటకు వెళ్లడానికి, రావడానికి ఒకే మార్గం



దువ్వాడ రైల్వేస్టేషన్

అగనంపూడి : వాల్తేరు రైల్వేస్టేషన్‌కు వెళ్లాల్సిన రైళ్లను రైల్వే ఉన్నతాధికారులు 'సమయం ఆదా' పేరుతో దారి మళ్లిస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర వ్యయప్రయాసలకు గురవు తున్నారు. రోజువారీ రైళ్లతో పాటు ప్రత్యేక రైళ్లను కూడా ఇదే మార్గంలో నడపడం వల్ల వందలాది మంది ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

అమృత్ భారత్ ఆర్భాటాలు, సౌకర్యాల కొరత

అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా రైల్వే అధికారులు కనీస సౌకర్యాలు, వసతుల కల్పన కంటే హంగులు, అదనపు భవనాలు, ఆర్భాటాల ఏర్పాటుకే మొగ్గు చూపుతుండటంతో ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. విశాఖకు వెళ్లే ప్రతి రైలు తిరుగు ప్రయాణం కోసం విధిగా ఇంజిన్ మార్చాల్సి వస్తుందని, దీనివల్ల 10 నుంచి 15 నిమిషాల సమయం వృథా అవుతుందని భావించిన రైల్వే ఉన్నతాధికారులు ఆరేళ్ల క్రితం నుంచే రైళ్లను దారి మళ్లించేందుకు ప్రణాళికలు రచించారు. అప్పటి నుంచి విశాఖకు వెళ్లకుండా దువ్వాడ, విజయనగరం మీదుగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బెంగాల్‌లకు వెళ్లే రైళ్లన్నింటినీ మళ్లిస్తున్నారు.

సౌకర్యాలు లేక ప్రయాణికుల ఆగ్రహం

విశాఖను కాదని దువ్వాడలో హాల్ట్ ఇచ్చిన అధికారులు, ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో శ్రద్ధ చూపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీనికి తోడు ప్రత్యేక రైళ్లను కూడా ఇదే దారిలో నడపడం వల్ల 40 నుంచి 50 కిలోమీటర్ల దూరం నుంచి ప్రయాణికులు దువ్వాడకు రావాల్సి వస్తుండటంతో నానా అగచాట్లు పడుతున్నారు. దువ్వాడలో విశ్రాంతి గదులు, ప్లాట్‌ఫామ్‌పై ఫ్యాన్లు, మంచినీరు, భోజనం లేదా అల్పాహారం వంటి కనీస సౌకర్యాలు లేకపోవడం ప్రయాణికులకు పెద్ద సమస్యగా మారింది. ఉన్న లిఫ్ట్ కూడా సగం రోజులు పనిచేయదని, మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ ఉండదని ప్రయాణికులు వాపోతున్నారు. స్టేషన్ బయట కూడా ఈ సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు హైరానా పడాల్సి వస్తోంది.



నిలువ నీడ లేని దువ్వాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్



లోతట్టులో ఉన్న ప్లాట్‌ఫామ్

లగేజీలతో ఇబ్బందులు

ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు హిందూజా రైల్వే ట్రాక్ కోసం నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి వరకు మాత్రమే ఆటోలు, కార్లను అనుమతిస్తుండటంతో, లగేజీలను వంతెన పైనుంచి మోసుకువెళ్లడానికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రయాణికుల డిమాండ్లు

దువ్వాడ మీదుగా రాకపోకలు సాగించే రైళ్లకు దువ్వాడలో హాల్ట్ ఇస్తూ, విశాఖ మీదుగా మళ్లిస్తే ఈ కష్టాలు తప్పవని, లేదా దువ్వాడ స్టేషన్‌లో అన్ని వసతులు కల్పించాలని ప్రయాణికులు రైల్వే అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

దువ్వాడలో మాత్రమే హాల్ట్ ఉన్న ప్రత్యేక రైళ్లు, వాటి రాకపోకల వివరాలు	
సికింద్రాబాద్-అగర్తల	(07030)
అగర్తలా-సికింద్రాబాద్	(07029)
బ్రహ్మపూర్-చర్లపల్లి	(07028)
చర్లపల్లి-బ్రహ్మపూర్	(07027)
చెన్నై-షాలీమార్	(02842)
షాలీమార్-చెన్నై	(02841)
యశ్వంత్‌పూర్-సంత్రాగచ్చి	(02864)
సంత్రాగచ్చి-యశ్వంత్‌పూర్	(02863)
చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డు	(07422)
శ్రీకాకుళం రోడ్డు-చర్లపల్లి	(07421)
కటక్-హైదరాబాద్	(07166)
హైదరాబాద్-కటక్	(07165)
సహర్సగన్-చర్లపల్లి	(07047)
చర్లపల్లి-సహర్యాగన్	(07046)
ఖుర్దా రోడ్-శివాజీటెర్మినల్	(01050)
శివాజీటెర్మినల్-ఖుర్దా రోడ్	(01049)
చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డు	(07025)
శ్రీకాకుళం రోడ్డు-చర్లపల్లి	(07026)
కటిహార్-హుబ్లీ	(07326)
బెంగుళూర్- మాల్డా	(06565)
మాల్డా-బెంగుళూరు	(06566)
బెంగళూరు-నారంగి	(06559)
నారంగి-బెంగళూరు	(06560)
భువనేశ్వర్-యశ్వంత్‌పూర్	(02811)
యశ్వంత్‌పూర్-భువనేశ్వర్	(02812)

క్లుప్తంగా

రుణాలు మంజూరు చేయాలని వినతి

గాజువాక : డీసీసీబీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ యువతకు రుణాలు మంజూరు చేయాలని భెల్ హెచ్‌పీవీపీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు ఆధ్వర్యంలో నాయకులు డీసీసీబీ చైర్మన్ కోన తాతారావును కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ యువత వ్యాపారం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రోత్సహించాలని కోరారు. తాతారావును కలిసినవారిలో అసోసియేషన్ నాయకులు కంచిపాటి ప్రకాష్, ముద్రగడ శ్వేత, టెక్కలి భాస్కరరావు తదితరులున్నారు.

కాలేయ వ్యాధి బాధితుడికి ఆర్థిక సాయం



ఆటో డ్రైవర్‌కు నగదు అందిస్తున్న శ్రీభావనా రుషి మార్కండేయ సేవా సంఘం ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు, దువ్వాడ సెక్టార్-1 కాలనీలో నివాసముంటున్న ఆటో డ్రైవర్ గిడుతూరి కనకరాజు కాలేయ వ్యాధితో బాధపడుతూ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆయన పరిస్థితిని తెలుసుకున్న అగనంపూడి దిబ్బపాలేనికి చెందిన శ్రీ భావనా రుషి మార్కండేయ సేవా సంఘం మానవతా దృక్పథంతో స్పందించింది. ఈ మేరకు సంఘం కనకరాజుకు రూ.12 వేలు, నెలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను సహాయంగా అందించింది. సంఘ ప్రతినిధులు గుడే సుశీలా గజేంద్రరావు, నీలి రాంబాబు, పొన్నగంటి వెంకటరమణ, గంధోళి నరసింగరావు, పొన్నగంటి వెంకటస్వామి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ రూ.లక్షన్నర చెక్‌ను అందిస్తున్నఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి కాలనీకి చెందిన ముదునూరి నాగరాజు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 1.5 లక్షల ఆర్థిక సాయం అందింది. నాగరాజు భార్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో, ఆమె శస్త్రచికిత్స నిమిత్తం ఈ మొత్తాన్ని మంజూరు చేశారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోగా, సదరు మొత్తాన్ని మంజూరు చేస్తూ చెక్కును అందజేశారు.

మెడిటేషన్‌తో ఏకాగ్రత



శఖానంద స్వామీజీకి జ్ఞాపిక అందజేస్తున్న కరస్పాండెంట్ రామారావు

గాజువాక : నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలనుకొనే విద్యార్థులు మెడిటేషన్, కరుణ అలవాటు చేసుకోవాలని రామకృష్ణ మిషన్ స్వామీజీ శఖానంద అన్నారు. విలువలు, నైతికత అంశంపై స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మెడిటేషన్ వల్ల ఏకాగ్రత పెరుగుతుందని, ఇది లక్ష్యాలను చేరుకోవడానికి దోహదం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, అధ్యాపక ప్రతినిధులు పాల్గొన్నారు.

మంచినీటి బోరు ప్రారంభం

గాజువాక : జీవీఎంసీ 72వ వార్డు చినగంట్యాడ ఎస్సీ కాలనీలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన మంచినీటి బోరును ఆ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశామన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్స్, పార్కుల అభివృద్ధికి కృషి చేశానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎ.లక్ష్మణరావు, సీహెచ్. కన్నారావు, జి.ఆనంద్, అప్పారి విష్ణుమూర్తి, కొల్లి దేముడు, ఈశ్వరరావు, మండే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా



గ్రీవెన్స్ కమిటీ చైర్మన్ విజయకుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు కోరారు. శనివారం ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ అండ్ రీడ్రెస్సల్ చైర్మన్ డి. విజయకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు తమ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కమిటీ చైర్మన్ విజయకుమార్ స్పందిస్తూ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన న్యాయం కోసం యాజమాన్యానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న చైర్మన్ విజయకుమార్‌ను అసోసియేషన్ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్లు ఎస్. సుందరం, బాబు నాయక్, డాక్టర్ రాధిక, మనోజ్ ఓరాన్, జయానంద్, అలాగే అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. తౌడన్న, బయ్యే మల్లయ్య, కె.వి. రత్నం, డి. పుల్లారావు, మోహన్ బాబు, సాయిప్రసాద్, శ్రీధర్, ఎం.వి. రావు, అంబేడ్కర్, శ్రీనివాస్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.3.5 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ పీలా, ఎమ్మెల్యే పల్లా

గాజువాక : నగరంలో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 67వ వార్డులో రూ.3.50 కోట్లతో చేపట్టనున్న ప్రధాన కాలువలు, పైప్‌లైన్లు, రోడ్లు, వీధి కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గణేష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల దాహార్తిని తీర్చే ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్టు తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. 67వ వార్డును మోడల్ వార్డుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ బీఆర్‌ఎస్ శేషాద్రి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం

అగనంపూడి: భూమాతకు ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ పిలుపునిచ్చారు. 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం జాతీయ రహదారిపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన నినాదాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపీకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి, నీరు, వాతావరణం కరువైపోతున్న పరిస్థితుల్లో మన పరిసరాలతో పాటు బహిరంగ ప్రదేశాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, ప్లాస్టిక్ మన నిత్యజీవితంలో ఒక భాగంగా మారిపోవడం వల్లనే ఈ దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అనంతరం రోగులు, వారి సహాయకులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, ఏఓ రవిరాజు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

మానవ మనుగడ ప్రశ్నార్థకం : ప్లాస్టిక్ వ్యర్థాలు మానవ మనుగడను ప్రశ్నార్థకం చేస్తాయని, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై. శ్రీనివాసరావు అన్నారు. ఫార్మా కళాశాల ఆధ్వర్యంలో పరిధిలోని కాపు జగ్గరాజుపేట గ్రామస్తులకు శనివారం నార సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో సత్యవతితో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపులో ఉద్రిక్తత



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బందిని అడ్డుకుంటున్న మంత్రి మంజుల



ఆలయ ఆవరణలో రెవెన్యూ అధికారులు

పెదగంట్యాడ: పెదగంట్యాడ గ్రామం సర్వే నం. 274లోని కొండపోరంబోకు భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాల తొలగింపు శనివారం ఉద్రిక్తతకు దారితీసింది. వాంబే కాలనీలోని వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆనుకొని ఉన్న కొండ ప్రాంతంలో అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్న సమాచారంతో పెదగంట్యాడ మండల రెవెన్యూ సిబ్బంది వాటిని తొలగించేందుకు ప్రయత్నించారు. అయితే అక్కడే ఉన్న మంత్రి మంజుల, దొడ్డి రమణ రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్నారు. దీంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. రెవెన్యూ సిబ్బంది అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ ఘటనపై పెదగంట్యాడ మండల తహసీల్దార్ అమల మాట్లాడుతూ, సర్వే నంబర్ 274లో ప్రభుత్వ భూమి ఉందని స్పష్టం చేశారు. గతంలో దొడ్డి రమణ, మంత్రి మంజుల అనే ఇరువురు ఈ ప్రాంతంలో ఆలయం నిర్మించారని, అయితే ఇటీవల ఆలయానికి సమీపంలో అక్రమంగా కొత్త నిర్మాణాలు చేపడుతున్నారని తమకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ నిర్మాణాలను తొలగించేందుకు వెళ్లిన తమ సిబ్బందిపై దొడ్డి రమణ, మంత్రి మంజులతో పాటు మరో 8 మంది దాడి చేసి విధులకు ఆటంకాలు కల్పించారని తహసీల్దార్ ఆరోపించారు. సదరు వ్యక్తులు ఆరోపిస్తున్నట్లు పాత నిర్మాణాల జోలికి వెళ్లలేదని, మంత్రి మంజుల హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి కొత్తగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆమె అన్నారు. ఈ విషయమై గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశామని తహసీల్దార్ తెలిపారు. మరోవైపు, మంత్రి మంజుల రెవెన్యూ సిబ్బందిపై ఎదురుదాడి చేశారు. హిందూ దేవాలయంపై పెదగంట్యాడ మండల రెవెన్యూ సిబ్బంది దాడి చేశారని ఆమె ఆరోపించారు. ప్రతి శనివారం ఇక్కడ అన్నదానం నిర్వహిస్తుంటామని, శనివారం రెవెన్యూ సిబ్బంది వచ్చి దౌర్జన్యం చేశారని, భక్తులను భయభ్రాంతులకు గురి చేశారని ఆమె వాపోయారు. కోర్టు ఆదేశాలు ఉన్నా రెవెన్యూ సిబ్బంది ఇలా దాడి చేయడం సరికాదని మంజుల పేర్కొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన

దాబాగార్డెన్స్: అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, శానిటేషన్ కాంట్రాక్టర్ దుర్మార్గపు విధానాలు విడనాడాలని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం మానాలని సిటు ఆధ్వర్యంలో శనివారం కేజీహెచ్ మెయిన్ గేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిటు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం రూ.16 వేలు జీతం శానిటేషన్ వర్కర్లకు ఇవ్వాలని, ఈఎస్ఐ సక్రమంగా కట్టాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిటు సీనియర్ నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు, జోన్ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పందుల స్వైర విహారం



65వ వార్డు వికాష్‌నగర్ ప్రధాన రహదారిలో క్యూ కట్టిన పందులు



75 వార్డు సీతానగరం ఏడు గుళ్ల సమీపంలో పందులు

పెదగంట్యాడ: వర్షాకాలం మొదలవడంతో దోమలు, ఈగలతో పాటు పందుల బెడద మండలంలోని ప్రజలకు శాపంగా మారింది. శానిటరీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అన్ని వార్డుల్లోనూ పందులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. మురుగు కాలువలను ఆవాసాలుగా చేసుకుని తిష్ట వేస్తున్న పందులు, అకస్మాత్తుగా ఇళ్లలోకి చొరబడి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా పందుల బెడద అధికంగా ఉండటంతో, ఎక్కడ వ్యాధుల బారిన పడతామో అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని, పందుల నియంత్రణలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోందని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తు వదిలి, పందుల బెడద లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో డెంగ్యూ, మలేరియా వంటి రోగాలతో పాటు పందుల వల్ల వచ్చే ఇతర ఆరోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఫెస్టివల్



సినీ గీతాలు ఆలపిస్తున్న జయంత్, ప్రసన్న



నృత్యప్రదర్శన చేస్తున్న గుణశ్రీ

ఉక్కునగరం: స్టీల్‌క్లబ్ 22వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం క్లబ్ ఆడిటోరియంలో మెగా మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఫెస్టివల్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇండియన్ ఐడల్, సూపర్ సింగర్ ఫేమ్ జయంత్ , ప్రసన్న, హర్షవర్ధన్‌లు పలు సినీ గీతాలను ఆలపించి శ్రోతలను అలరించారు. ప్రముఖ గాయకుడు సుప్రీమ్ శేఖర్ తన వైవిధ్యమైన పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. అంతర్జాతీయ నృత్య కళాకారిణి గుణశ్రీ ప్రదర్శించిన నృత్యాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలను స్టీల్‌ప్లాంట్ జీఎం వి. చిట్టిబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఎం. మధుసూదనరావు, కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి వై. రవికుమార్, కోశాధికారి వేణుగోపాల్, కార్యవర్గ సభ్యులు కె.ఎల్. నరసింహం, కృష్ణయ్య, ఎ. రమేష్, జె. రమేష్, భువన్ కిరణ్, వి.ఎస్.వి. రాజు, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రక్షక భటులకే.. రక్షణ కరువు



కూటమి ప్రజాప్రతినిధులు పోలీసులకు నిలువ నీడ లేకుండా చేస్తున్నారు. పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకోవడం కోసం ట్రాఫిక్ పోలీసులను ఎండలో నిలబడేలా చేస్తున్నారు. ఎన్‌టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం బీచ్ రోడ్డులో తలసేమియా రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమం కోసం నోవాటెల్ ఎదురుగా ఉన్న ట్రాఫిక్ పోలీసుల పోస్టుకు భారీ కటౌట్ ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు ఎండలోనే విధులు నిర్వర్తించాల్సి వచ్చింది. పెద్దల ఆశీస్సుల కోసం పోలీసులను ఇబ్బందులకు గురి చేయడాన్ని ప్రజలు తప్పుబడుతున్నారు.

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు..

దాబాగార్డెన్స్: చదవాలనే పట్టుదలతో పాటు క్రమశిక్షణ ఉంటే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని టింపనీ పాఠశాల మాజీ డైరెక్టర్ నళిని నెల్సన్ పేర్కొన్నారు. కైట్స్ నోబుల్ పాఠశాలలో శనివారం ఇన్వెస్టిట్యూర్ కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ లక్షణాలు కలిగిన విద్యార్థులను కెప్టెన్, వైస్ కెప్టెన్, హౌస్ కెప్టెన్, క్లాస్ లీడర్లుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేశారు. పాఠశాల వ్యవస్థాపకురాలు నిరుపమ పరుచూరి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడా, సాంస్కృతి, సాంప్రదాయాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.